క్లుప్తంగా

మునికుమారికి పలువురి పరామర్శ

ముమ్మిడివరం: పితృ వియోగంతో బాధపడుతున్న జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి బాలమునికుమారిని గురువారం పలువురు నాయకులు పరామర్శించారు. మునికుమారి తండ్రి కటికిదల సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ముమ్మిడివరంలోని ఆమె స్వగృహంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, శెట్టిబత్తుల రాజబాబు, పిన్నంరాజు వెంకటపతిరాజు, పెన్మత్స వాసురాజు, నేల కిశోర్, ముదునూరి సతీష్‌రాజు, బుల్లిరాజు, కుడిపూడి శివన్నారాయణ, నల్లా నరసింహమూర్తి, ఏడిద సుబ్బు తదితరులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ముమ్మిడివరం: విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.

లంక తల్లమ్మ జాతర ప్రారంభం


లంక తల్లమ్మ

ముమ్మిడివరం: ముమ్మిడివరం గ్రామ దేవత లంక తల్లమ్మ జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, వివిధ వ్యాపార, వర్తక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 17 రోజుల పాటు అమ్మవారి సంబరాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 17న అమ్మవారి ఊరేగింపు, జాగారం, 18న తీర్థం, 20న దండాడింపుతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

16 మంది గర్భిణులకు రక్తదానం


రక్తదానం చేస్తున్న స్వామి వివేకానంద యోగాశ్రమ విద్యార్థులు

అమలాపురం టౌన్: రక్తహీనతతో బాధపడుతున్న 16 మంది గర్భిణుల కోసం స్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన విద్యార్థులు గురువారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి రక్తం అత్యవసరమైతే యోగాశ్రమానికి చెందిన నలుగురు విద్యార్థులు ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. కాకినాడ వెళ్లి రక్తదానం చేసిన మట్టపర్తి అర్జున్, బండారు దుర్గారావు, గుత్తుల దుర్గేష్, దార్లంక గోపిలను యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అభినందించారు.

సాదాసీదాగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


తాళ్లరేవు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనలు అనుసరించి సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీలు కొపనాతి లలిత, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చింతా మోహనకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

రేపు హనుమాన్ జయంతి


యానంలో భక్తాంజనేయస్వామి

యానాం: స్థానిక శివాలయ ఆవరణలో కొలువైన భక్తాంజనేయస్వామి సన్నిధిలో వచ్చే నెల 1న హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకులు పెద్దింటి నరసింహాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం స్వామికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, సహస్ర నామ నాగవల్లి పత్ర సహిత గంగా సింధూర కార్యక్రమం, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కావున భక్తులందరూ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

కాలుష్య కోరల్లో పంట కాలువలు

- కాలువల్లోకి వదిలేస్తున్న డ్రైనేజీ నీరు, వ్యర్థాలు
- అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే ఈ దుస్థితి


అన్నంపల్లిలో ప్రధాన పంట కాలువ దుస్థితి


చెత్తాచెదారంతో నిండిపోయిన మురమళ్ల-గుత్తెనదీవి పంట కాలువ

ముమ్మిడివరం: ప్రజలకు తాగు, సాగునీరు అందించే పంట కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పశు కళేబరాలతో అధ్వాన్నంగా మారాయి. అసలే నీటికి కటకటలాడుతున్న రైతులు పంట కాలువలన్నీ మురుగునీటి కాలువలుగా మారిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వివిధ పంట కాలువలు మురుగుతో చెత్తాచెదారం పేరుకుపోయి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మళ్లీ కాలువలకు నీటి విడుదల చేసేలోపు వీటిని ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే నీరు కలుషితమై ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదముంది.

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువలతో పాటు మీడియం, మైనర్ కాలువల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కాలువల్లో మురుగునీరే కాకుండా కుళ్లిన జంతు కళేబరాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయి ఉంటున్నాయి. కాలువ పక్కకు వెళితే చాలు దుర్గంధం వెదజల్లుతోంది. అప్పుడప్పుడు పంచాయతీ సిబ్బంది పరిసర ప్రాంతాల వారికి నోటీసులు జారీ చేసినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. మాగాం-అయినాపురం పంట కాలువ ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో గ్రామం నడిబొడ్డున సుమారు కిలోమీటరు మేర ప్రవహిస్తుంది. కాలువ వెంబడి ఉన్న నివాస గృహాల్లోని మురుగునీటిని పైపులైన్ల ద్వారా పంట కాలువలో వదులుతున్నారు. అంతేకాకుండా కుళ్లిన వ్యర్థాలను కాలువలో వేస్తున్నారు. దీంతో కాలవలోని నీరు కలుషితమవ్వడమే కాకుండా ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. పంటకాలువను ఆనుకుని షిర్డీ సాయిబాబా ఆలయం, భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం, గీతామందిరం ఉన్నాయి. ఈ ఆలయాలకు వచ్చే భక్తులతో పాటు అనునిత్యం వందలాది మంది అయ్యప్ప భక్తులు ఈ కాలువలోనే పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. పంట కాలువను ఆధునీకరించి ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న ఆలోచన మరుగున పడింది. పంట కాలువలు అధ్వానంగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నీటిపారుదల, పంచాయతీ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు స్పందించి పంట కాలువల ప్రక్షాళన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

అల్లవరం: సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు ఉదయం 10.30 గంటల కంటే ముందుగా విధులకు హాజరై హాజరుపట్టీలో సంతకాలు చేస్తున్నారా లేదా అనే విషయంపై ఎంపీడీఓ కృష్ణమోహన్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని బెండమూర్లంక, తుమ్మలపల్లి, మొగళ్లమూరు, గోడిలంక, అల్లవరం 1, 2 సచివాలయాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఉద్యోగి నిర్దేశించిన సమయానికి విధులకు హాజరుకావాలని సూచించారు. విధుల నిమిత్తం ఫీల్డ్ వర్కుకు వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏటిగట్టు వాస్తవ పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రాజమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం


సాయిబాబా సన్నిధిలో విద్యార్థులను సత్కరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నంలో కొలువైయున్న షిర్డీ సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. గురుదేవులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో అఖండ సాయి నామ సంకీర్తన జరిపారు. అనంతరం పుర వీధుల్లో సాయిబాబాను ఊరేగించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు సత్కరించి ఆర్థిక సాయాన్ని అందించారు.

మధ్యాహ్న భోజన సహాయకులకు శిక్షణ


నీలపల్లి హైస్కూల్‌లో సీసీహెచ్‌లకు శిక్షణ ఇస్తున్న విద్యాశాఖాధికారులు

తాళ్లరేవు: స్థానిక నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన తయారీ సహాయకులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంఈఓలు ఎ.మంగాయమ్మ, ఎం.ఉమ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న సీసీహెచ్‌లు హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన భోజనం తయారు చేసి వడ్డించాలని సూచించారు. రోజువారీ మెనూ ప్రకారం బృందాలుగా విభజించి వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌లుగా జి.గంగాభవాని, సీహెచ్ దుర్గా భవానీలు వ్యవహరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.రాధాకృష్ణ, 78 మంది సీసీహెచ్‌లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే సమాచారం ఇవ్వండి

ప్రజలకు పట్టణ సీఐ క్రిస్టోఫర్ విజ్ఞప్తి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పట్టణ సీఐ క్రిస్టోఫర్

అమలాపురం టౌన్: పట్టణ పరిధిలోని కాలనీలు, వీధుల్లో ఎవరైనా అపరిచితులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక మద్దాలవారిపేటలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో గురువారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా అందరూ రాజకీయాలకు అతీతంగా సంయమనంతో ఉండాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఓట్ల లెక్కింపు సాగేందుకు అందరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున పట్టణంలో పోలీసుల పెట్రోలింగ్ నిరంతరాయంగా సాగుతుందన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం

యానాం: నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్, సీబీఎస్ఈ స్కూళ్లు వచ్చే నెల 12వ తేదీ నుంచి పునఃప్రారంభించాలని పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రియదర్శిని గురువారం ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి మే 31వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభించాల్సి ఉండగా వేసవి తీవ్రత దృష్ట్యా సెలవులను పొడిగించారు. ఈ సెలవుల పెంపు ఆదేశాలు మొత్తం నాలుగు రీజియన్లకు వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంతరించిపోతున్న ఈత చెట్లు


చల్లపల్లిలోని ఆక్వా చెరువు గట్టుపై విరగకాసిన ఈత చెట్టు

ఉప్పలగుప్తం: ఒకప్పుడు వేసవి వచ్చిందంటే చాలు గ్రామీణ ప్రాంతాల్లో ఈత పళ్ల కోసం పిల్లలు, పెద్దలు కూడా పోటీ పడుతుండేవారు. గ్రామాల్లో ఈత చెట్ల కింద ఈత పళ్లు ఏరుకోవడం, పక్వానికి వచ్చిన తర్వాత ఈత గెలలను కోసుకుని వెళ్లి మగ్గబెట్టి ఎంతో ప్రీతిపాత్రంగా తినేవారు. ఆక్వాపై మోజుతో పచ్చని పొలాలను చెరువులుగా మార్చేయడం, రియల్ ఎస్టేట్ పేరుతో చెట్లను నరికేస్తుండడంతో ఈత చెట్లు కూడా కనుమరుగైపోతున్నాయి. ఎక్కడైనా ఈత చెట్లు ఉండి వాటికి వేసవిలో విరివిగా ఈత పళ్ల గెలలు కాస్తే వాటిని మేకలు, గొర్రెల ఆహారం కోసం గొర్రెల కాపరులు తీసుకెళ్లిపోతున్నారు. అందుకే ఈత పళ్లు అందని ద్రాక్షగా మారాయి. అంతరించి పోతున్న ఈ అరుదైన ఈత చెట్టు చల్లపల్లి పంచాయతీ పరిధిలోని ఆక్వా చెరువుల వద్ద కనిపించింది. ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా గురువారం తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి


డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

అమలాపురం రూరల్: జిల్లాలోని పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో వెంకటేశ్వర్లుకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అప్పారి వెంకటేశ్వరరావు, పీతల రామచంద్రరావు మాట్లాడుతూ ప్రధాన పంట కాలువలు, డ్రెయిన్ల ఆధునీకరణ పనులు చేపట్టక ఏటా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అందుకే తక్షణం పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు కాలువల్లో ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఈ-బస్ పథకం ద్వారా 75 బస్సులు

యానాం: పీఎం ఈ-బస్ పథకం ద్వారా 75 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని గురువారం పుదుచ్చేరి అధికారులు తెలిపారు. హౌసింగ్ అండ్ అర్బన్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరఫున కన్వర్జన్స్ ఎనర్జీ సర్వీసెస్ పథకం ద్వారా పుదుచ్చేరి వ్యాప్తంగా 75 బస్సులను కొనుగోలు చేయనున్నామన్నారు.

ఒకరికి గాయాలు

అయినవిల్లి: ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైనట్లు అయినవిల్లి పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మడుపల్లికి చెందిన గుమ్మడి ఏసు పచ్చిమిర్చి లోడుతో బైక్‌పై ముక్తేశ్వరం నుంచి అమలాపురం వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో బైక్ సిరిపల్లి కొండలమ్మ చింత వద్ద అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఏసును అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.25 వేల విరాళం

ఐ పోలవరం: మురమళ్లలో కొలువైన వీరేశ్వరస్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు భక్తుడు రూ.25 వేల విరాళం అందజేశారని ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. అమలాపురానికి చెందిన భ్రమరాంబ చెన్న మల్లేశ్వర స్వామివారి నెలవారీ లక్షపత్రి పూజా సంఘం పేరు మీద కొత్తలంక వెంకట ప్రభాకరశర్మ అన్నదానం నిమిత్తం రూ.25 వేలను అందజేశారన్నారు. దాతను ఆలయ మర్యాదలతో శేషవస్త్రం, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి సత్కరించారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

యానాం: నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని పుదుచ్చేరివ్యాప్తంగా అమలు చేయాలని కోరుతూ ఎల్జీ రాధాకృష్ణన్‌కు ఏఐఏడీఎంకే కార్యదర్శి ఎ.అన్బళగన్ గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టాన్ని అన్ని ప్రైవేట్ స్కూళ్లలోనూ అమలు చేస్తే వాటిలో చదివే 25 శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్య అందుతుందన్నారు. పుదుచ్చేరికి ప్రత్యేక విద్యాబోర్డు లేదని, దీంతో తమిళనాడు తరహాలో విద్యారంగంలో సంస్కరణలు అమలు చేయలేకపోతున్నారన్నారు.

ఇక్కడకు రావొద్దు.. డ్రైవింగ్ స్కూల్‌కు వెళ్లండి

- దిష్టిబొమ్మలా యానాం రవాణా శాఖ కార్యాలయం
- యానాంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నెలకొల్పిన డ్రైవింగ్ స్కూల్‌లోనే రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు


యానాం మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం

యానాం: వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ, వాటి పునరుద్ధరణ తదితరమైన సేవలను రవాణా శాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అందిస్తుంటారు. కాని యానాంలో మాత్రం ఇవన్నీ ఓ డ్రైవింగ్‌స్కూల్ నిర్వాహకుల కనుసన్నల్లో జరుగుతున్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. వాహన రిజిస్ట్రేషన్‌కు మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే తక్కువ ఖర్చు అవుతుందనే ఉద్దేశంతో యానాంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు సైతం యానాం ఆర్‌టీఓ ఆఫీసుకు వస్తుంటారు. అయితే స్థానికంగా ఆర్‌టీఓ లేకపోవడం, పుదుచ్చేరి నుంచి ఆరు నెలలకోసారి ఇన్‌చార్జి వస్తుండడంతో వాహనాల రిజిస్ట్రేషన్ బాగా ఆలస్యమవుతుంది. ఇదే అదనుగా ఆర్‌టీఓ ఆఫీసులో పనిచేసే ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి స్థానికంగా ఓ డ్రైవింగ్ స్కూల్ పెట్టి అక్కడి నుంచే డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌ల పునరుద్ధరణతో సహా సమస్త సేవలు అందిస్తున్నారు. వివిధ సేవల కోసం రెట్టింపు ఫీజు వసూలు చేస్తూ కమీషన్ల దందాకు తెర లేపాడు. ఆర్‌టీఓ ఆఫీసుకు వచ్చే వాహనదారులను ఇక్కడ పనవ్వదని, డ్రైవింగ్ స్కూల్‌కు వెళితేనే అవుతుందని పంపించేస్తున్నారు. అలా కాదని ఎవరైనా రవాణా శాఖ కార్యాలయానికే వస్తే నెలల తరబడి తిప్పుతున్నారు. దీంతో వాహనదారులు చేసేది లేక సొమ్ములు సమర్పించుకోవడానికి సిద్ధపడి డ్రైవింగ్ స్కూల్‌నే ఆశ్రయిస్తున్నారు. డ్రైవింగ్ స్కూల్ అనేది డ్రైవింగ్ నేర్పడానికి కాదని కేవలం కమీషన్ల దందా కోసమే ఆ పేరుని వాడుకుంటున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రవాణా శాఖ కార్యాలయానికి వచ్చినవారిని డ్రైవింగ్ స్కూల్‌కు మళ్లించేందుకు ప్రత్యేకించి కొందరు మనుషులను సైతం నియమించినట్లుగా వాహనదారులు చెబుతున్నారు.

అధికారుల ప్రమేయం లేకుండా సాధ్యమేనా?

ఒక డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుల ద్వారా లైసెన్స్‌లు, పునరుద్ధరణలు, వాహనాల రిజిస్ట్రేషన్ల దరఖాస్తులు చేస్తే అధికారుల ప్రమేయం లేకుండా వాటికి ఆమోదముద్ర పడడం సాధ్యమేనా? ఇదే ప్రశ్న వాహనదారులు అడుగుతున్నారు. కమీషన్ల కోసం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగితో కుమ్మక్కై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కావాలనే నెలల తరబడి కార్యాలయానికి రావడం లేదని ఆరోపిస్తున్నారు. దాదాపు ఆరు నెలల తరువాత గత మంగళవారమే ఇన్‌చార్జి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాల సుబ్రహ్మణ్యన్ రవాణా శాఖ కార్యాలయానికి వచ్చారు. అదీ మూడు రోజుల టూర్ మాత్రమే.. ఆ సమాచారం అందడంతో సుమారు 150 మంది వాహనదారులు రవాణా శాఖ కార్యాలయానికి వచ్చారు. అయితే వాటిలో కేవలం 50 మందికి మాత్రమే సేవలందాయి. యానాంలో డ్రైవింగ్ స్కూల్ కేంద్రంగా రిజిస్ట్రేషన్లు జరగడంపై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాల సుబ్రహ్మణ్యన్‌ను వివరణ కోరగా వాహన సేవలకు ఇతరులను ఆశ్రయించొద్దని, నేరుగా రవాణా శాఖ కార్యాలయానికి వస్తే సరిపోతుందన్నారు. పుదుచ్చేరి నాలుగు రీజియన్లకు కలిపి నలుగురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నామన్నారు. తాను యానాంకు ఇన్‌చార్జిగా మాత్రమే పుదుచ్చేరి నుంచి వస్తున్నానన్నారు.

అట్టహాసంగా అమ్మవార్ల తీర్థం


పాశర్లపూడిలో దేవతలు నూకాలమ్మ, మహాలక్ష్మమ్మ

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామ దేవతలు నూకాలమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. సోమవారం నుంచి గురువారం వరకూ జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణలు, పూలతో అమ్మవార్ల ఆలయాలను దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. తీర్థం సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

బాబా మందిర వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో సాయిబాబు మందిర వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సుదర్శనం కేశవచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

సఖినేటిపల్లి: వచ్చే నెల 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ఆయా కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. మోరి, అంతర్వేదికర, టేకిశెట్టిపాలెం ఏటిగట్టు, అంతర్వేది రోడ్డు సెంటర్, కేశవదాసుపాలెంలలో ఆలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మోరి శ్రీరామభక్తాంజనేయ స్వామివారి ఆలయం వద్ద అర్చకుడు సుదర్శనం రంగాచార్యులు ఆధ్వర్యంలో, మోరి శేషన్న రాయుడు కాల్వగట్టు ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయం వద్ద అర్చకుడు ఎస్‌బీవీఎస్ సాయి దుర్గానగేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, నిత్య సింధూర పూజలు నిర్వహించనున్నారు. స్వామివారి భక్త బృందం సభ్యులచే ఏకాహం ఆలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నారు.

ఐరన్ సిరప్స్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్స్ అందజేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్త్ భారత్‌లో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ వేశారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల పోరాటాలతోనే హక్కుల సాధన


సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన దుర్గాప్రసాద్


ముమ్మిడివరంలో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు

యానాం: కార్మికుల పోరాటాల ద్వారానే హక్కులు సాకారమవుతాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ట్యాక్సీ స్టాండ్ వద్ద, పారిశ్రామిక ప్రాంతాల్లోను సీఐటీయూ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలను కార్మికులు, రైతులు ఒక్కటై ఎదురించి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ యానాం శాఖ కన్వీనర్ కుంచే సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాస్, యాదల శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, దాసరి రాజు, సలాది నాగబాబు, సత్తిబాబు, రాజేష్, బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకుడు పెట్టా శివప్రసాద్ ఆధ్వర్యంలో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం కార్మికులకు సమకూర్చిన హక్కులను ప్రభుత్వాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, కె.గోవిందరావు, కె.వెంకట శివ, రమణ, అరుణ్‌కుమార్, అజయ్, వెంకటేశ్వరరావు, రమేష్, అరుణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ విజయవంతం చేయండి


మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

మామిడికుదురు: అమలాపురం మెట్ల సత్యనారాయణ కాపు కల్యాణ మంటపంలో జూన్ 2న జరిగే సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమజ్జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వెయ్యి మంది భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందన్నారు. ఈ మహాయజ్ఞంలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశం అనంతరం భక్తులకు కరపత్రాలు పంచారు. జిల్లా కార్యదర్శి ప్రయాగ నర్సింహమూర్తి, టీటీడీ ప్రతినిధులు గొవ్వాల నాగరాజు, కంచర్ల గణపతిరావు, బొక్కా సూర్యప్రకాశరావు, అనిశెట్టి పండు, రుద్రా శ్రీను, పాయసం సత్తిబాబు పాల్గొన్నారు.